సాక్షి
ఖమ్మం
సోమవారం । 25 । నవంబర్ । 2024



అన్ని వసతులతో గురుకులం

జిల్లాలోని వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అన్ని వసతులతో కూడిన గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. 8లో



ఖమ్మానిదే నెట్‌బాల్ ట్రోఫీ

మహబూబాబాద్ జిల్లా కల్వల ఉన్నత పాఠశాలలో జరిగిన నెట్‌బాల్ ట్రోఫీలో ఖమ్మం జట్టు విజయం సాధించింది. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 15°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి వేళ మాత్రం చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీసీసీబీ సీఈఓగా వెంకట ఆదిత్య

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ఇన్‌చార్జ్ సీఈఓగా ఎస్.వెంకటఆదిత్యను నియమిస్తూ తెలంగాణ సహకార కేంద్ర బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ గోపి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట ఆదిత్య ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంక్‌లో ఏజీఎంగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో బ్యాంకు చైర్మన్ అభ్యర్థన మేరకు వెంకట ఆదిత్యను ఇక్కడ సీఈఓగా నియమించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న మేనేజర్ వసంతరావు తిరిగి ఆయన పాత స్థానంలోకి వెళ్లనున్నారు. వెంకట ఆదిత్య సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది. కాగా.. రుణమాఫీ, ఇన్సూరెన్స్, ఉద్యోగులకు ప్రోత్సాహకాలు తదితర అంశాలపై ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ తన పదవికి రాజీనామా చేశారు. పలు అంశాలపై విచారణ జరుగుతున్న వేళ రెహమాన్ చేసిన రాజీనామాను రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ ఉన్నతాధికారులు అనుమతిస్తారా లేదా అనేది వేచి చూడాలి.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు వీరే..

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల జట్టు ఎంపికలు ఆదివారం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 55 మంది బాలికలు హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.రఘునందన్ తెలిపారు. ఎంపికైన వారిలో ఉషశ్రీ, వర్షిత, కీర్తి, నందిని, సాయిప్రసన్న, సింధు, సంధ్య, సౌమ్య, మానస, మంజుశ్రీ, అన్విత, బాలదీప్తి, శ్రీజ, అర్పి, శృతి త్రివేణి ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో పీడీలు సీహెచ్.కృష్ణయ్య, పాముల శ్రీనివాస్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక

నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సంఘం కార్యదర్శి ఎం.డి. షఫీక్‌అహ్మద్ తెలిపారు. అండర్-8 బాలుర జట్టులో ఎం.వివేక్, ఈ.భువన్‌తేజ, బాలికలలో లాస్యశ్రీ, జె.సాత్విక, అండర్-10 బాలురలో సీ.రోహిత్, పి.అశోక్, సీహెచ్. జీవన్, టి.కృష్ణ, బాలికలలో ఎం.భవిత, డి.లోహిత, టి.నిత్యశ్రీ, అండర్-12 బాలురలో ఈ.వరుణ్, శ్రీసాయి ఆదర్శ్, బాలికలలో హస్మిత, ప్రతిభ ఎంపికయ్యారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ ఎం.డి. గౌస్, ఎం.సుధాకర్, రవి, నవీద్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 399 మంది



పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ

కల్లూరు: కల్లూరు బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 399 మంది హాజరయ్యారు. కల్లూరు డివిజన్ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ, ఏన్కూరు మండలాల విద్యార్థులు పరీక్ష రాయగా డీఈఓ సోమశేఖర్ శర్మ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ పత్తిపాటి నివేదిత పాల్గొన్నారు.



నకిలీ దందా !

డీసీసీబీలో తప్పుడు ధ్రువపత్రాలతో రూ.కోట్ల రుణాలు

- తాజాగా నకిలీ బంగారం తాకట్టుతోనూ లోన్‌లు..
- పక్కదారి పడుతున్న బ్యాంకు సొమ్ము
- అధికారులు, ఉద్యోగుల కనుసన్నల్లోనే అక్రమాలు !

ఖమ్మంవ్యవసాయం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నకిలీ దందాలకు అడ్డాగా మారింది. తప్పుడు ధ్రువపత్రాలు, నకిలీ బంగారంతో కొందరు పెద్ద ఎత్తున రుణాలు తీసుకుంటూ బ్యాంకుకే కుచ్చుటోపీ పెడుతున్నారు. ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసం ఏర్పడిన ఈ బ్యాంకు ప్రజావసరాలకు సైతం ఉపయోగపడేలా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. బ్యాంక్ ఆర్థిక స్థాయిని పెంచేందుకు అనేక రకాల రుణాలను పాలకవర్గాలు అందుబాటులోకి తెచ్చాయి. లక్ష్యం బాగానే ఉన్నా.. కొందరు దాన్ని పక్కదారి పట్టించారు. ఖమ్మం, భద్రాద్రితో పాటు మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో కలిపి 100 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో ఈ బ్యాంక్ విస్తరించి ఉంది. ఈ సంఘాలతో పాటు 176కు పైగా పరపతేతర సంఘాలు ఉన్నాయి. బ్యాంకు పరిధిలో 50 బ్రాంచ్‌లు ఉండగా, దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. బ్యాంకు విస్తృతి బాగానే ఉన్నప్పటికీ అక్రమాల్లో కూడా రాష్ట్రంలో ఈ బ్యాంకుకు అంతే పేరు ఉంది. బ్యాంకు అందించే రుణాలను ఆసరాగా చేసుకుని నకిలీ ధ్రువపత్రాలతో కొందరు మార్ట్‌గేజ్ రుణాలు తీసుకుని ఎగనామం పెట్టిన ఘటనలు వెలుగుచూశాయి. తాజాగా నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న విషయం బయటపడింది. ఇలా నకిలీ ధ్రువపత్రాలు, నకిలీ బంగారం తాకట్టుతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. అయితే ఈ వ్యవహారాలన్నీ బ్యాంకు అధికారులు, ఉద్యోగుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాలుగేళ్లు గడిచినా చర్యలేవి..?

2017లో ఖమ్మం నగరంలోని ఎస్‌ఎస్‌టీ, రోటరీనగర్, హెడాఫీస్ బ్రాంచ్‌ల నుంచి 21 మంది ప్లాట్లను మార్ట్‌గేజ్ చేసి రూ.6 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. 2020లో ఆ రుణాల రికవరీపై దృష్టి సారించగా అక్రమాలు వెలుగుచూశాయి. నకిలీ ధ్రువపత్రాలతో మార్ట్‌గేజ్ రుణాలు తీసుకున్నట్లు బయటపడింది. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులు, ఫ్రాడ్ కమిటీ, రాష్ట్ర కో - ఆపరేటివ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వివిధ కోణాల్లో విచారణ చేశారు. నాబార్డ్ కూడా ఇది అక్రమమని గుర్తించింది. బ్యాంకును మోసం చేశారంటూ నగరంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కొందరిపై కేసులు కూడా పెట్టారు. ఈ అక్రమం బయటపడి నాలుగేళ్లు గడిచినా ఇంత రకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లోనూ నకిలీ ధ్రువపత్రాలతోనే 16 మందికి రూ.10 లక్షల చొప్పున రుణాలు ఇచ్చారు. ఈ వ్యవహారంపై మాత్రం విచారణ జరిపి బ్యాంకు మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. ఏడేళ్ల కాలంలో ఈ బ్యాంకు నుంచి నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా దాదాపు రూ.10 కోట్ల రుణాలు పక్కదారి పట్టాయి.

తాజాగా నకిలీ బంగారం తాకట్టుతో..

నకిలీ ధ్రువపత్రాల అక్రమాల వ్యవహారం కొనసాగుతుండగానే తాజాగా నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న ఘటనలు బయటపడుతున్నాయి. కొందరు బ్రాస్‌లెట్లు, ఇతర నకిలీ బంగారు వస్తువులు పెట్టి రోటరీనగర్, అంబేద్కర్ మార్ట్, గట్టయ్యసెంటర్, ఎన్‌ఎస్‌టీ, హెడ్ ఆఫీస్ బ్రాంచీల్లో రుణాలు తీసుకున్నారు. వన్ గ్రాం గోల్డ్ తరహాలో కడియాలు, ఇతర వస్తువులపై కొంత మేర బంగారు పూత పూయించి స్వచ్ఛమైన బంగారంగా నమ్మబలికి రుణాలు పొందారు. అయితే బంగారు ఆభరణాలు తాకట్టుపెడితే అప్రైజర్లు పరిశీలించాలి. వారు ధ్రువీకరించిన తర్వాతే రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా, రుణం ఇచ్చిన తర్వాత ఈ బంగారం నకిలీదిగా బ్యాంకు వర్గాలు గుర్తించాయి. ఇంకా ఇతర వాణిజ్య బ్యాంకుల్లోనూ నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అయితే వాణిజ్య బ్యాంకుల అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదంటున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

బ్యాంకుల్లో రుణాల మంజూరుకు నియమావళి ఉంటుంది. నిబంధనల మేరకు ధ్రువపత్రాలను పరిశీలించి, ఆభరణాలు పరీక్షించి.. అవసరమైతే సంబంధిత నిపుణులు ధ్రువీకరించాకే రుణాలు ఇవ్వాలి. కానీ అలాంటి చర్యలేమీ లేకుండానే కొందరికి రూ.కోట్ల రుణాలను అధికారులు, ఉద్యోగులు ఎలా ఇచ్చారనేది అనుమానాలు రేకెత్తిస్తోంది. వారి ప్రమేయం లేకుండా అక్రమాలకు తావులేదనే చర్చ జరుగుతోంది. ఈ అక్రమ వ్యవహారాలు కూడా ఉద్యోగులు, అధికారులు ఆయా బ్రాంచీల నుంచి బదిలీ అయిన తర్వాతే బయటపడుతుండడం గమనార్హం.

పేరుకే విచారణలు..

బ్యాంకు బ్రాంచీల నుంచి రూ.కోట్ల అక్రమాలు జరుగుతున్న తీరుపై వివిధ స్థాయిల్లో విచారణ నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో డీసీసీబీ, టస్కాబ్, కో – ఆపరేటివ్ రిజిస్ట్రార్ శాఖలు ప్రత్యేక కమిటీలతో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నాయి. అయితే ఉన్నత స్థాయిలో మాత్రం అధికారులు అంతగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పాలక వర్గాలు, రాజకీయ నాయకుల జోక్యంతో అక్రమార్కులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాలపై బ్యాంకు సీఈఓ వసంతరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆదివారం సెలవు కావడంతో కార్యాలయంలో లేకపోగా, ఫోన్‌లో కూడా స్పందించలేదు.

ఉగాది నాటికి పనులు పూర్తిచేయాలి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- వెలుగుమట్ల పార్క్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఖమ్మంఅర్బన్: ఉగాది నాటికి వెలుగుమట్ల అర్బన్ పార్క్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలుగుమట్ల అర్బన్ పార్క్ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్క్‌లో చేపట్టే డబుల్ లైన్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, ఉగాది నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వచ్చి కొంత సమయం ప్రశాంతంగా గడిపేలా అభివృద్ధి చేయాలని, పార్క్ స్థలం ఎక్కడి వరకు ఉందో సర్వే చేసి ప్రహరీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఖమ్మం నగర సమీపంలో అద్భుతమైన పార్క్ ఉండడం అదృష్టమని అన్నారు. ఖాళీ స్థలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించి ఫీజు వసూలు చేయాలని, తద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ, సొసైటీ చైర్మన్ సైదబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల చేతిలోనే కుటుంబ ఆరోగ్యం

కుటుంబ ఆరోగ్యం మహిళల చేతిలోనే ఉందని, నేడు ఉప్పు, పప్పు, పసుపు, కారం, మిరియాలు నుంచి పాల వరకు ప్రతీ దాంట్లో కల్తీ జరుగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మనం సాగు చేసిన ఆహార పదార్థాలు తినడమే మేలన్నారు. బాలపేటలోని మానుకొండ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ (సీటీజీ) ఆధ్వర్యంలో మిద్దె తోటలపై అవగాహన సదస్సు నిర్వహించగా మంత్రి హాజరై మాట్లాడారు. నగరంలో కూడా వందల సంఖ్యలో నివాసాలపై మిద్దె తోటలు పెంచడం శుభపరిణామం అన్నారు. మిద్దెతోటల పెంపకానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందేలా ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి మాట్లాడుతూ కూరగాయాల సాగు, ఆధునిక విధానాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యకుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సీటీజీ ఫౌండర్ హర్కార్ శ్రీనివాస్, కో ఫౌండర్ సరోజా, అడ్మిన్ శ్రీనివాస్, కైసర బేగం, మానుకొండ జ్యోతి, డాక్టర్ సరోజిని, నిర్మల, రాంబాబు, యరగర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఖమ్మంలోని చెరుకూరి వారి మామిడితోటలో వనసమారాధనకు హాజరైన ప్రజలు

కార్తీక మాసం ఆదివారం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుల, ఉద్యోగ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో వన భోజనాల వేడుకలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో పాటు పలు పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల, పాటల పోటీలు అలరించాయి. పలుచోట్ల సామూహిక సత్యనారాయణ వ్రతాలు, ఉసిరిచెట్ల వద్ద పూజలు నిర్వహించారు.

- వివరాలు 9లో

4,78,868 ఇళ్లలో సర్వే పూర్తి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడి

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా సాగుతోందని, జిల్లా వ్యాప్తంగా 5,68,493 ఇళ్లను గుర్తించగా, శనివారం నాటికి 4,78,868 ఇళ్లలో సర్వే పూర్తయిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే చివరి దశకు చేరుకుందని, ఇందులో డేటా ఎంట్రీ కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని భట్టి సూచించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 59.50శాతం, పాలేరులో 93.64, మధిరలో 94.41, వైరాలో 96.98, సత్తుపల్లిలో 98.09 శాతం పూర్తయిందని వివరించారు. డేటా ఎంట్రీకి అవసరమైన ఆపరేటర్లను గుర్తించామని, పక్కాగా నమోదు చేస్తున్నామని తెలిపారు.

నేడు మధిరలో ప్రజాపాలన విజయోత్సవం

ప్రజాపాలన విజయోత్సవాన్ని సోమవారం మధిరలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, నేడు మధిరలో జయ జయహే ప్రజాపాలన కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు.



న్యాయవాది కృష్ణవేణికి అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

ఖమ్మం ప్రజలు మానవత్వం చాటారు

ఖమ్మంగాంధీచౌక్: ఇటీవల వరదల్లో ఖమ్మంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు మానవత్వం చాటారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన నెలనెలా వెన్నెల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరద, బురదలో నడుస్తుంటే వెల్లువెత్తిన సమస్యలు హృదయ విదారకంగా ఉన్నాయని గుర్తు చేశారు. జిల్లా ప్రజలు, ఇతరులు 'మేమున్నాం' అంటూ సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమంతో వినాయక మండపాల వద్ద వరద సహాయంపై ప్రచారం చేస్తే రెండు రోజుల్లో రూ.25 లక్షలు వచ్చాయని తెలిపారు. ఖమ్మం వంటి మంచి జిల్లాలో కలెక్టర్‌గా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నెల నెలా వెన్నెల వంటి కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేసి సంస్కృతి, ఇతిహాసాలపై దృష్టి పెంచాలని పిలుపునిచ్చారు. అనంతరం ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి సతీమణి మాలతి వర్ధంతి సందర్భంగా ఆమె పేరిట జీవిత సాఫల్య పురస్కారాన్ని ఖమ్మానికి చెందిన న్యాయవాది డాక్టర్ వనం కృష్ణవేణికి కలెక్టర్ అందించి అభినందించారు. అనంతరం అమరావతి కళాకారులు ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను అలరించింది. మోటమర్రి జగన్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్క్ సంస్థ కార్యదర్శి ఏఎస్ కుమార్, ఖమ్మం కళా పరిషత్ కార్యదర్శి వేల్పుల విజేత, ప్రజానాట్యమండలి కార్యదర్శి వేల్పుల సదానందం, నాగబత్తిని రాజా చైతన్య, పుతుంబాక కృష్ణప్రసాద్, కె.దేవేంద్ర, వనం సమ్మయ్య, కోన జనార్దన్ రావు, మోత్కూరి గోపాల్ రావు, నాగబత్తిని భాస్కర్ రావు, కట్టా కృష్ణార్జున రావు, ఈశ్వరప్రగడ రంగనాథ్ పాల్గొన్నారు.

మైసూర్‌లో జగదభిరాముడి కల్యాణం

భద్రాచలం: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో భద్రాచలం శ్రీ సీతారాముడి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీరామ ప్రచార రథం ద్వారా చేరుకున్న స్వామివారికి అక్కడి భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను కొలువుదీర్చారు. కల్యాణతంతును కమనీయంగా నిర్వహించారు. మైసూర్‌కు తరలివచ్చిన సీతారాములను భక్తులు దర్శించుకుని పరమానంద భరితులయ్యారు. ఆలయ ఈవో ఎల్.రమాదేవి, అర్చకులు, పండితులు పాల్గొన్నారు. కాగా దేవస్థానం అంతరాలయంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.



మైసూర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎస్‌ఎఫ్‌ఐతోనే స్పందించే గుణం..

- రాజ్యాంగ పరిరక్షణకు ఇక్కడి నుంచే బీజాలు వేయాలి
- మతాన్ని జాతీయతతో ముడిపెట్టే ఆలోచనను వ్యతిరేకించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు
- ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా సాగిన వేడుక



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఖమ్మంమయూరిసెంటర్: సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిందని సమాఖ్య పూర్వ విద్యార్థి, ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం తెలుగునాట రాజ్యాంగ పరిరక్షణకు బీజాలు వేయాలని ఆకాంక్షించారు. ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్ (ఏచూరి ప్రాంగణం)లో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం.. రాజ్యాంగం పిలుస్తోంది' అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థి ఉద్యమ సమయంలో రాజ్యాంగంలోని మౌలిక విలువలు, మతం, లౌకికతత్వంపై ఘర్షణ పడ్డామన్నారు. మత విశ్వాసాలున్న ప్రజలందరినీ వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, కానీ మతం ఆధారంగా రాజకీయ సమీకరణాలు, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని, మతాన్ని జాతీయతతో ముడిపెట్టే ఆలోచనలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మన పోరాటం మతంపైన కాదు.. మతోన్మాదంపైన అని స్పష్టం చేశారు.

విద్వేషంపై పోరాటంలో శ్రీకృష్ణుడు కూడా కలిసి వస్తాడు..

మత విద్వేషంపైనే జరిపే పోరాటంలో ఆఖరికి శ్రీ కృష్ణ పరమాత్మ కూడా కలిసి వస్తాడని నాగేశ్వర్ చెప్పారు. భగవద్గీత ఏడో అధ్యాయం 21వ శ్లోకంలో శ్రీ కృష్ణుడు 'ఎవరికి ఎవరియందు భక్తి విశ్వాసాలు కలిగి ఉన్నా... వారిలో వారియందు భక్తి విశ్వాసాలను నేనే కల్పిస్తాను.. అర్జున' అని అన్నారని ఉదహరించారు. క్రీస్తును నమ్మేవాళ్లకు ఏసుపై, అల్లాను విశ్వసించే వారికి అల్లాపై విశ్వాసాన్ని కృష్ణుడే కల్పిస్తాడు... ఇక విద్వేషాలకు చోటెక్కడిది.? అని ప్రశ్నించారు. రాష్ట్రాల రాజకీయ ఉనికి, న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తి, భారతీయత భావనపైన దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక అసమానతలు రూపుమాపాలన్నారు. గంటకు గౌతమ్ అదానీ రూ.1600 కోట్లు సంపాదిస్తున్నారని, కానీ దేశంలో కటిక పేదరికంలో మగ్గేవారు అనేక మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక దేశం కార్పొరేట్ల రాజ్యంగా మారిందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కూడా హరించి వేస్తున్నారని, చివరకు పంట కాల్వల్లో పారే నీరు కూడా తమ నియంత్రణలో ఉంటుందని, దానికి కావాల్సిన డబ్బులు పంపించాలని రాష్ట్రాలకు కేంద్రం అల్టిమేటం జారీ చేసిందన్నారు.

తరలివచ్చిన 1500 మంది పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1500 మంది వరకు హాజరయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థులు, ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా ఉన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర తదితరులు ప్రసంగించారు. ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థులు ఆలపించిన గేయాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీతారాంఏచూరి, జన విజ్ఞాన వేదిక జీవ పరిణామం తదితర పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. తొలుత ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి మాటూరి రామచంద్రరావు సహా అసువులు బాసిన పూర్వ విద్యార్థులకు సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఏజే రమేష్ ప్రవేశపెట్టారు. సంఘ పతాకాన్ని సీనియర్ పూర్వ విద్యార్థి కొండపల్లి పావన్ ఆవిష్కరించగా, మరో విద్యార్థి ఉన్నం లక్ష్మీనారాయణ రాజ్యాంగ ప్రవేశిక పఠనం ప్రతిజ్ఞ చేయించారు. పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు, సమ్మేళనం కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, విప్లవ్ కుమార్, అనురాధ, కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షవర్గంగా ఈ కార్యక్రమం కొనసాగింది.

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న సన్యాసయ్య

కల్లూరురూరల్: మండలంలోని పుల్లయ్యబంజర్, లక్ష్మీపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఓ సన్యాసయ్య ఆదివారం పరిశీలించారు. రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ధాన్యం విక్రయిస్తున్న రైతులకు సంబంధించిన డేటా ఎంట్రీలను, ట్రక్కు షీట్లు, గన్నీ బస్తాల సరఫరాకు సంబంధించిన వివరాలను ఆయన తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పూనటి అలోక్

ఖమ్మంస్పోర్ట్స్: మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు నగరానికి చెందిన పూనటి అలోక్ ఎంపికయ్యాడు. లాంగ్‌జంప్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కోచ్ ఎండీ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన గంధం ఆకాష్ (21) పురుగులమందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెంది ఆకాష్ శనివారం గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

మోసం చేసినవారిపై కేసు

పాల్వంచ: చిట్టీ వేయించుకుని డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగిన ఇద్దరిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బొల్లేరుగూడెంనకు చెందిన తాళ్లూరి కృష్ణకుమారి, ఆమె కూతురు దీపికకు గట్టాయిగూడెంనకు చెందిన దొడ్డ బాలాజీ, కొలిపాక సాయిరాం కలిసి మాయమాటలు చెప్పి రూ.5లక్షల చిటీ వేయించారు. 30 నెలలు కట్టిన తర్వాత చిట్టీ డబ్బులు అడుగగా ఇవ్వకుండా ఆరు నెలలుగా తిప్పుకుంటున్నారు. ఈ విషయమై అడిగేందు కు దీపిక వెళ్లగా డబ్బులు ఇచ్చేది లేదని దూషించారు. చంపు తామంటు బెదిరించారు. దీంతో కృష్ణకుమారి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

స్పెల్ బీ, మ్యాథ్ బీతో మేధస్సు


పరీక్షలను పర్యవేక్షిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు, సాక్షి బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ

- భవిష్యత్‌కు దోహద పడేలా పరీక్షలు
- 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహణ.. విశేష స్పందన
- పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా.. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సాక్షి మీడియా ఆధ్వర్యంలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు పేర్కొన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలను ఆదివారం నగరంలోని రెజొనెన్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెజొనెన్స్ డైరెక్టర్లు మాట్లాడుతూ.. సాక్షి మీడియా ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని, తొలుత పాఠశాల స్థాయిలో పరీక్షలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి జిల్లాస్థాయిలో పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారు రీజినల్, రాష్ట్రస్థాయికి వెళ్తారన్నారు. స్పెల్ బీ విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా, మ్యాథ్ బీ విద్యార్థులకు గణితంపై మరింత ఆసక్తిని పెంచేలా ఈ పరీక్షలు ఉన్నాయని చెప్పారు. రెజొనెన్స్ కళాశాలలో జరిగిన పరీక్షా కేంద్రంలో నగరంలోని సర్వజ్ఞ, న్యూ విజన్, హార్వెస్ట్, బ్లూమింగ్ మైండ్స్, మిలీనియం, బ్లాసమ్స్, టీబీఎం, రెజొనెన్స్ ఇన్ఫో, రెజొనెన్స్ శ్రీనగర్, ఆక్స్‌ఫర్డ్, నిర్మల్ హృదయ్, త్రివేణి, మధిరలోని శ్రీనిధి, నారాయణ, సత్తుపల్లిలోని కేకేఆర్ గౌతమ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని త్రివేణి, భద్రాచలంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సాక్షి మీడియా గ్రూప్, అసోసియేట్ స్పాన్సర్ ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి, ప్రెజెంటింగ్ స్పాన్సర్ డ్యూక్స్ వ్యాఫీ వ్యవహరించారు. పరీక్షలను సాక్షి బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ పర్యవేక్షించగా... సాక్షి సిబ్బంది వేణు, ఏవీ రామారావు, నందగోపాల్ పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

పోటీ పరీక్షలకు ఉపయోగం..



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్ బీ పరీక్షను రాయటం ఆనందంగా ఉంది. ఈ పరీక్ష ద్వారా భవిష్యత్‌లో జరిగే పోటీ పరీక్షలను సులభంగా రాసేందుకు దోహదపడుతుంది. పోటీ పరీక్షలను ఏ విధంగా రాయాలనే అవగాహన వచ్చింది. సాక్షి మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు.

– లియాకత్ అర్షియాఖామ్, నందస్, 9వ తరగతి, సర్వజ్ఞ స్కూల్, ఖమ్మం

అవగాహన వచ్చింది..



మ్యాథ్ బీ పరీక్ష రాయటంతో అవగాహన వచ్చింది. ఈ పరీక్ష రాయటం ద్వారా కొత్త విషయాలు తెలియటంతో పాటు సబ్జెక్టుపై మరింత పట్టు లభించింది. పరీక్ష సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలిసింది. ప్రశ్నాపత్రం తీసుకున్న సమయం నుంచి ముగింపు వరకు ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలనే విషయం తెలిసింది.

– ఆర్.నిధిసంహిత, 8వ తరగతి, రెజొనెన్స్ శ్రీనగర్ స్కూల్, ఖమ్మం

ఆనందంగా ఉంది..



స్పెల్ బీ పరీక్ష రాయటం చాలా ఆనందంగా ఉంది. దీని ద్వారా విజ్ఞానం పెరుగుతుంది. పోటీ పరీక్షలను ఇప్పటి నుంచే రాయటం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి పరీక్షలనైనా సులభంగా రాసే అవకాశం ఉంటుంది. మరిన్ని పోటీ పరీక్షలను నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నా.

– పి.షరన్‌రోస్, శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్, మధిర

పోటీతత్వం పెరుగుతుంది



పోటీ పరీక్షలు రాయటం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది. పోటీ పరీక్షలు ఎలా రాయాలన్న అవగాహన పూర్తిస్థాయిలో లభించింది. పరీక్షలంటే ఉన్న భయం తొలగిపోయింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మ్యాథ్ బీ పరీక్షలు నిర్వహించటం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలు తెలుస్తాయి.

–పి.నందనసాయిభాను, 7వ తరగతి, కేకేఆర్ గౌతమ్ స్కూల్, సత్తుపల్లి

'సాక్షి'కి ధన్యవాదాలు



సాక్షి మీడియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగపడేలా సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలను నిర్వహించటం అభినందనీయం. ఈ పరీక్షలు భవిష్యత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయి. సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. పోటీ పరీక్షలు ఎంత సమయంలో రాయాలి.. ఎలాంటి సందేహాలు లేకుండా ప్రశాంతంగా ప్రశ్నలకు జవాబులు రాయడం కూడా తెలిసింది.

– పి.సాయిఋహాన్, 4వ తరగతి, ఖమ్మం

కొత్త అంశాలు తెలుస్తున్నాయ్



స్పెల్ బీ పరీక్షను రాయటం ద్వారా కొన్ని కొదాలు, కొత్త అంశాలు తెలిశాయి. సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షను రాయటం ఆనందంగా ఉంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇలాంటి పరీక్షలు దోహదపడతాయి. ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహిస్తే విద్యార్థుల్లో ఉన్న భయం పోతుంది.

– ఎండీ సగ్రమా ఫిరోదోస్, న్యూవిజన్, ఖమ్మం

సబ్జెక్టుపై పట్టు వచ్చింది..



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష రాయటం ద్వారా ఇంగ్లిష్‌పై పట్టు వచ్చింది. ఈ పరీక్ష ద్వారా కొన్ని కొత్త విషయాలు తెలిశాయి. ప్రతి అంశంపై పట్టు సాధించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి. భవిష్యత్‌లో జరిగే పరీక్షలకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. మున్ముందు మరిన్ని పరీక్షలను నిర్వహించాలి.

– ప్రణయ, 9వ తరగతి, త్రివేణి స్కూల్, కొత్తగూడెం

కుటుంబ సభ్యుల చెంతకు మహారాష్ట్ర వాసి



మహారాష్ట్ర వాసిని కుటుంబసభ్యులకు అప్పగించుతున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి తొమ్మిది నెలలు కిందట ఇంటి నుంచి తప్పిపోయిన ఓ వృద్ధుడిని అన్నం సేవా ఫౌండేషన్ బాధ్యులు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అన్నం శ్రీనివాసరావు కథనం ప్రకారం.. నాలుగు నెలల కిందట గుర్తు తెలియని వృద్ధుడు ముదిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో దీనస్థితిలో తిరుగుతుండగా పోలీసులు సదరు వృద్ధుడిని అన్నం ఫౌండేషన్‌కి అప్పగించారు. తర్వాత ఆ వృద్ధుడు.. మహారాష్ట్రలోని కొలహపూర్ జిల్లా తాలూకా రాధానగరి గ్రామం అని వివరాలు చెప్పగా ఇంటర్నెట్ ద్వారా అక్కడి పోలీసు, రెవెన్యూ సిబ్బందితో ఫోన్‌లో సంప్రదించినట్లు తెలిపారు. కుటుంబం ఆచూకీ కనుగొని, వీడియో కాల్ చేయగా.. కుటుంబ సభ్యులు వృద్ధుడిని గుర్తుపట్టారు. దీంతో పలు ఆధారాలు పరిశీలించి.. అన్ని రకాల అనుమతులు తీసుకుని, వృద్ధుడిని తన కుమారుడు సలీంనాయక్‌కు అప్పగించామని శ్రీనివాసరావు వివరించారు.

జీడిపల్లి సమీపంలో ఎదురుకాల్పులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిపల్లి సమీపంలో నూతనంగా పోలీస్ క్యాంపు ఏర్పాటు కానుండగా, ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి జీడిపల్లికి వెళ్లిన సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్‌కు చెందిన పోలీసు బలగాలు తిరిగి వస్తున్న క్రమంలో మావోయిస్టులు పైకి కాల్పులు జరిపారు. బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారు. ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న జీడిపల్లిలో నూతనంగా క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్యాంపు ఏర్పాటవుతున్న ప్రాంతానికి ధర్మారం నుంచి తాత్కాలిక రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నూతన క్యాంపులు ఏర్పాటవుతున్న ప్రతీ సారి మావోయిస్టులు కాల్పులకు దిగడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారింది.

ఖమ్మానిదే నెట్‌బాల్ ట్రోఫీ..

- బాల, బాలికల విభాగంలో ప్రథమస్థానం
- ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు


కేసముద్రం/ఖమ్మంస్పోర్ట్స్: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామ జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాల, బాలికల (అండర్–17) నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలికల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. నల్లగొండ ద్వితీయస్థానం, వరంగల్ తృతీయస్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వరంగల్ ద్వితీయస్థానం, నల్లగొండ తృతీయస్థానంలో నిలిచాయి. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి.. విజేతలకు పతకాలు, మెమెంటోలు అందించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు, కీడలపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఇదే పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి గట్కా పోటీలను ప్రారంభించారు.


బాలుర జట్టుకు బహుమతి అందిస్తున్న డీఎస్పీ, మార్కెట్ చైర్మన్

కార్యక్రమంలో ఎస్‌ఐ మురళీధర్‌రాజు, అంబటి మహేందర్‌రెడ్డి, డీవైఎస్‌ఓ జ్యోతి, సత్యనారాయణ, విశాల్‌సింగ్, బండారు నరేందర్, కల్లెం వీరారెడ్డి, బండారు వెంకన్న, పీడీలు, టోర్నమెంట్ నిర్వాహకులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఐఈడీ బ్లాస్ట్‌లో జవాన్‌కు తీవ్రగాయాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి జవాన్‌కు తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయగూడలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాంపునకు చెందిన డీఆర్జీ జవాన్ పొడియం వినోద్‌గా గుర్తించారు. డీఆర్జీ బలగాలు మావోయిస్టుల కోసం రాయగూడ అడవిలో గాలింపు చేపట్టగా శనివారం రాత్రి 11 గంటల సమయంలో, మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఈడీ తగిలి జవాన్ గాయపడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం ఆయనను క్యాంపునకు తరలించారు.



అన్ని వసతులతో 'గురుకులం'

- వైరా నియోజకవర్గానికి యంగ్ ఇండియా గురుకులం మంజూరు
- 20 ఎకరాల్లో నిర్మాణానికి అనుమతి


వైరాలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల స్థలం

వైరా: సామాజిక అంతరాలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఉండాలని ఆలోచన చేసింది. అందులో భాగంగానే ప్రతి నియోజకర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 28 పాఠశాలలు మంజూరు కాగా జిల్లాలో మధిర, పాలేరు నియోజకర్గాల్లో వీటి శంకుస్థాపనలు కూడా పూర్తి చేశారు. రెండో విడతగా రాష్ట్ర వ్యాప్తంగా మరో 26 నియోజకకవర్గాల్లో గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో భాగంగా జిల్లాలో వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు చోటు దక్కింది.

మాణిక్యాలను వెలికి తీసేందుకు..

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడమే యంగ్ ఇండియా గురుకుల పాఠశాలల ముఖ్య ఉద్దేశం. ఉన్నత ప్రమాణాలతో బోధన ఉండేలా పాఠశాలాల రూపకల్పన చేశారు. ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమత లేక మధ్యలోనే చదువును ఆపడం, చిన్న చిన్న ఉద్యోగాలకే పరిమితం అయ్యే వారికి ఈ పాఠశాల విద్యార్థుల జీవితాలను మార్చే విధంగా ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన వసతులు ఉండనున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ స్థాయిలో పోటీను తట్టుకునేందుకు 4వ తరగతి నుండి ఇంటర్ వరకు బోధన ఉంటుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఐఐటీ, నీట్ వంటి కళాశాలలల్లో సీట్లు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దనున్నారు.

20 ఎకరాల్లో గురుకులం

నియోజకవర్గ కేంద్రంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను 20 ఎకరాల్లో నిర్మించనున్నారు మధిర రోడ్డులో ఇప్పటికే నిర్మించి ఉన్న తెలంగాణ బాలిక గురుకుల పాఠశాల, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలు 4.3 ఎకరాల్లో మాత్రమే ఉన్నాయి. ఆ పాఠశాలల పరిధిలో మరో 20.11 ఎకరాల స్థలం ఉండడంతో ఈ పాఠశాలల నడుమనే ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మించేందుకు అనుకూలంగా ఉందని రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. అటు తర్వాత జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ఇక్కడ స్థలం అనుకూలంగా ఉందని నివేదిక ఇవ్వడం ఇటీవల జరిగిన క్యాబినేట్ సమావేశంలో నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ నెల 22వ తేదిన ఇంటిగ్రేటెట్ గురుకులాలలకు అనుమతులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సకల వసతులు.. మెరుగైన బోధన

నియోజకవర్గంలో ఇప్పటికే 14 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ఉన్నారు. వాటితో పాటుగా ఒక మోడల్ స్కూల్, ఏకలవ్య పాఠశాల, ఆశ్రమ పాఠశాలలు, కేజీవీబీలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ నియోజకవర్గ కేంద్రంలో అదునాతన సదుపాయలతో ఇంటిగ్రేటెట్ గురుకుల పాఠశాలలో బోధన కాకుండా విద్యార్థులకు ఆధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. 20 ఎకరాల్లో నిర్మించే పాఠశాలలో సుమారు 2500 మందికి పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. వీరిని అన్ని రంగాల్లో తీర్చి దిద్దేందకు 120 మంది అధ్యాపకులను నియమించనున్నారు. విశాలమైన తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, యంప్ థియేటర్లు వంటి సౌకర్యాలు ఉండనున్నాయి. బాలబాలికలకు వేర్వేరుగా హస్టల్ నిర్మాణంతో పాటుగా పాఠశాల ప్రాంగణంలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి వసతి గృహాలు నిర్మించనున్నారు. ఇలా అన్ని హంగులతో నియోజకర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయస్థాయిలో బోధన



పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో బోధన ఇచ్చేందుకు నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వైరా నియోజకవర్గ కేంద్రానికి మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులందరికీ కృతజ్ఞతలు.

– మాలోతు రాందాస్‌నాయక్, ఎమ్మెల్యే, వైరా

కోడిపందేల స్థావరాలపై దాడి

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలక గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ వెంకటేశ్ దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,600 నగదు, రెండు మోటారు సైకిళ్లు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు


ఆర్థిక సాయం అందిస్తున్న సీఐ రాజు

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టగా హోంగార్డు బాణాల రామాచారికి తీవ్ర గాయాలయ్యాయి. ముదిగొండ నుంచి తన ద్విచక్రవాహనంపై ఖమ్మంకు విధుల నిమిత్తం వస్తుండగా ఈ ఘటన జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని ఖమ్మం వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ ముష్క రాజు చికిత్స కోసం హోంగార్డు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

గాయపడిన వ్యక్తి మృతి


సంజీవయ్య (ఫైల్)


నివాళులర్పిస్తున్న నరేశ్‌రెడ్డి

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్లేడు మాజీ సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్య (57) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ నెల 20న తిరుమలాయపాలెం పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి శస్త్రచికిత్స నిర్వహించి హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆరేళ్ల కిందట సంజీవయ్య భార్య వెంకటమ్మ మృతిచెందింది. సంజీవయ్య బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆయన అవయవాలను దానం చేసి ఔదార్యం చాటుకున్నారు. కాగా, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్ నివాళులర్పించారు.